అటకెక్కిన జలం జీవం

ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన జలం-జీవం పథకం అటకెక్కింది. ఏడేళ్లుగా నిర్వహణ పట్టించుకునే వారు లేక ఇంకుడు కుంతలు పూడుకుపోయాయి. అప్పట్లో ప్రజల భాగస్వామ్యంతో జలమండలి అధికారులు పనులు చేపట్టారు. అందుకయ్యే ఖర్చులో కొంత భరించేవారు. రానురానూ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించకపోవడం, అపార్ట్‌మెంట్‌ల్లో ఏర్పాటు చేసుకోవాల్సిన ఇంకుడుగుంతలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇవి పూర్తిగా కనుమరుగయ్యాయి. బహిరంగ ప్రదేశాల్లో నిర్మించిన వాటి పరిస్థితి సరేసరి. ఇందుకు నిలువుటద్దంగా మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాలు నిలుస్తున్నాయి.

- ఏడేళ్లుగా ఇంకుడు గుంతల ఊసేది?
- పనులు చేస్తున్నట్లు చూపిస్తుండటం విడ్డూరం
- మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాలలో కనుమరుగు
- పట్టించుకోని అధికారులు



భానునగర్‌లో పూడుకుపోయిన ఇంకుడుగుంత

సైదాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాలలో పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు 2017లో ప్రభుత్వం చేపట్టిన జలం- జీవం కార్యక్రమంలో ప్రధానంగా జలమండలి, జీహెచ్‌ఎంసీ పెద్దఎత్తున ఇళ్లలో, కాలనీలు, కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఏటా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయకపోవడంతో పాటు గతంలో ఏర్పాటు చేసిన వాటిలో వర్షపు నీరు ఇంకేలా పనులు నిర్వహించాల్సి ఉంది. కానీ అధికారులు అధికారులు పట్టించుకున్నా పాపాన పోలేదు. కాని 2017-25 వరకు నిర్వహణ నిమిత్తం నిధులు ఖర్చు చేస్తున్నారు కాని పనులు జరిగినట్లు దాఖలాలు లేవు. ఇవి కనుమరుగు కావడంతో వర్షపు నీరు డ్రైనేజీ పాలవడంతో భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోయింది. భూగర్భ జలాల మట్టాన్ని పెంచాలనే ఆశయమే నీరు గారిపోతుంది. ఈ వర్షాకాలంలోనైనా వాటికి మరమ్మతులు చేపట్టి వాననీరు వృథాగా కాకుండా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెరగనున్న భూగర్భ జలాలు

ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణంతో 2.592 లీటర్ల నీరు భూమిలో ఇంకుతుంది. ప్రతి ఇంటా నిర్మాణం చేపట్టినట్టయితే ఫలితంగా లక్షల నీటిని భూమిలోకి పంపించి భూగర్భ జలాలు పడిపోకుండా నిలువరించవచ్చు. ప్రతిఒక్కరూ నిర్మించుకునేలా అవసరముంది. భూగర్భ జలాలు పెంచితేనే నీటి మట్టం పెరుగుతుంది. ఫలితంగా మంచినీరు అందుతుంది

నిర్లక్ష్యం ఎందుకు?

గతంలో ఇంకుడు గుంతలను కాలనీవాసుల భాగస్వామ్యంతో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు ఏర్పాటు చేసేవారు. ఆసక్తి ఉన్నవారు నేరుగా ఆయా శాఖలకు దరఖాస్తు చేయొచ్చని లేదంటే ఆన్‌లైన్ ద్వారా కూడా వినియోగించుకోవచ్చని ప్రచారాన్ని చేపట్టేవారు. గడిచిన ఏడేళ్లుగా ప్రజలలో అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శలు వస్తున్నాయి. కాలనీల్లో, రోడ్ల పక్కన బహిరంగ ప్రదేశాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే 70 శాతం, సొంత ఇంట్లో ఏర్పాటు చేసుకుంటే 50 శాతం వ్యయాన్ని భరించేది. కానీ ఈ పథకాన్ని పూర్తిగా అటకెక్కించారనే విమర్శలు ఉన్నాయి.

వ్యర్థాలతో పూడుకుపోయాయి



పలు కాలనీల్లోని బహిరంగ ప్రదేశాలలో నిర్మించిన ఇంకుడు గుంతలు మట్టి , ఇతర వ్యర్థాలతో పూడుకు పోయాయి. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఇంకుడు గుంతల విషయాన్ని పూర్తిగా విస్మరించడంతోనే పరిస్థితి ఏర్పడింది. ప్రతీ అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతి ఇచ్చినప్పుడు విస్తీర్ణాన్ని బట్టి రెండు నుంచి నాలుగు ఇంకుడుగుంతలు నిర్మించాల్సి ఉంది. కానీ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో నిర్మాణాలు నామమాత్రంగా ఉన్నాయి.

మెట్టు భాస్కర్ రెడ్డి, చంపాపేట

క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం అవసరం



ముఖ్యంగా ఇంకుడుగుంతలను వినియోగంలోకి తేవాల్సిన అవసరముంది. వాటి ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టాలి. నీటి పొదుపునకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. కొత్త ఇళ్ల నిర్మాణాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే అనుమతి ఇవ్వాలనేది ప్రభుత్వ నిబంధన, అయితే సక్రమంగా అమలు కావడం లేదు.

- జనపాల మధు, మాదన్నపేట


యాదయ్యను సన్మానిస్తున్న హయత్‌నగర్ సర్కిల్ అధికారులు, ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతి సాధారణమే

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, పదవి విరమణ సర్వసాధారణమని జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డాక్టర్ తిప్పర్తి యాదయ్య సెలక్షన్ గ్రేడ్ కమిషనర్‌గా ఇటీవల పదోన్నతి పొందారు. శనివారం హయత్‌నగర్ సర్కిల్‌కు చెందిన అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్‌రావు, జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ దినేష్‌సింగ్, సూపరింటెండెంట్లు మహేందర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గంతో రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా మోహన్‌రావు

హయత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా ముసిపట్ల మోహన్‌రావును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వలిపె రాఘవేందర్‌రావు, కోశాధికారిగా ఆదిమూలం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా నెల్లుట్ల గోవర్ధన్‌రావు, మడుపు వసంతరావు, పప్పు వెంకట శివకుమార్, అక్కినపల్లి రుక్మిణి, సహాయ కార్యదర్శులుగా కొప్పర్తి రాధిక, వాడ్రెవు శివరామారావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా వింజమూరి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా గౌతం రాజు రఘురాంలు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రోడ్డు అబివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరయ్యారు. ఆదివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ టీచర్స్ కాలనీలోని సాయి గణపతి దేవాలయంలో జిల్లా అధ్యక్షుడు మంగు రాఘవరావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడ్ క్యాంప్ మాజీ చైర్మన్ ప్రసన్నకుమార్‌శర్మ, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, తులసి శ్రీనివాస్, మడుపు వేణుగోపాలరావు, సునీల్‌శర్మ, సాయిగణపతి ఆలయం పూజారి వీర్రాజుతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ నాయకులు అశోక్‌కుమార్ గౌడ్ తదితరులు

ఆ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

- సీనియర్ సిటిజన్స్ నాయకుడు అశోక్‌కుమార్ గౌడ్

వనస్థలిపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రజలు నివాసాలుండే ఇళ్లను అద్దెకు తీసుకుని ఏర్పాటు చేసిన ప్రైవేట్ పాఠశాలపై సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ నాయకులు అశోక్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలనీవాసులతో కలిసి ఆయన మాట్లాడారు. వనస్థలిపురం శ్రీలక్ష్మీగణపతి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వలన కాలనీవాసులు గత ఏడాదిగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలకు పార్కింగ్ లేదని, విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలం లేకపోవడంతో పాటు విపరీతమైన శబ్దాలతో దానిని ఆనుకుని ఉన్న తమలాంటి కుటుంబాలకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. అధికారులు, మున్సిపల్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కాలనీవాసులు, సీనియర్ సిటిజన్స్‌ల ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు కంచి కృష్ణమోహన్, మిట్టా రామ్మోహన్, లక్ష్మీనారాయణ, బాలేశ్వర్ పాల్గొన్నారు.

- ప్రత్యేక ప్రార్థనలు





ఈస్టర్ సందర్భంగా మూసారాంబాగ్‌లోని బేతనయ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ శామ్యూల్‌బాబు బైరపోగు, దిల్‌సుఖ్‌నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో సీనియర్ పాస్టర్ శాంతకుమార్, అధ్యక్షుడు లూకానందలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
-దిల్‌సుఖ్‌నగర్,ఆంధ్రజ్యోతి

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ ప్రాధాన్యం

- మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్



రాజ్యాంగ పరిరక్షణయాత్రలో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, చిత్రంలో దేప భాస్కర్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, శంకర్‌యాదవ్

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గాంధీ, అంబేడ్కర్‌లు సూచించిన అహింస విధానంతో రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ అడుగులు వేస్తుంటే మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే కిచ్చెనగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. జైబాపూ జైభీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ఆదివారం సరూర్‌నగర్ డివిజన్‌లో చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌నగర్‌లోని గాంధీ, అంబేడ్కర్‌ల విగ్రహాలకు కేఎల్ఆర్, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, శంకర్ యాదవ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర ద్వారా దేశప్రజలను చైతన్యపరుస్తు ఏకతాటిపై నిలిపారన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగాన్ని కాలగర్భంలో కలిపే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్ వేదికగా అంబేడ్కర్‌ను అవహేళన చేసేలా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుందన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్‌యాదవ్, సరూర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దన్‌రాజ్‌గౌడ్, చిక్కుళ్ల శివప్రసాద్, ఆకిట్ల నరేందర్ ముదిరాజ్, గుల్షన్, షఫీ, గంగం కిషోర్, యూనుస్, అజీజ్, సంతోష్‌కుమార్, నాగరాజు, భాస్కర్, జంగారెడ్డి, చిన్నయాదవ్, రంజిత్, మహిళా కాంగ్రెస్ నేతలు అరుణ, సంగీత, శైలజ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపాలిటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి

పదేళ్ల పాలనపై ప్రచారం చేయండి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ పదేళ్ల పాలనపై ఇంటింటి ప్రచారం చేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి కోరారు. ఆదివారం తుర్కయంజాల్‌లో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు ఏలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధిలోని 24 వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం బీజేపీ పాలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కార్యకర్తలను, నాయకులను కోరారు. దేశంలో ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఇతర కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. దేశ ప్రగతిలో భాగంగా ప్రధాని తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు, అమలు గురించి వివరించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం సహాయాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరవేయాలంటే కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ క్రమ శిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, ఎస్సీ మోర్చా కార్యదర్శి కొండ్రు పురుషోత్తం, నాయకులు నరసింహాగౌడ్, కందాళ బల్‌దేవ్‌రెడ్డి, అర్జున్‌గౌడ్, శ్రావన్‌గౌడ్, అనీల్‌కుమార్, యూసుప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, బీజేపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి

వ్యక్తిగత విమర్శలు తగవు

వనస్థలిపురం, ఏప్రిల్ 20(ఆంధ్ర జ్యోతి): రాచకాలువపై అక్రమ నిర్మాణాలు జరిగింది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనేననీ అప్పుడు అధికార పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న సుధీర్ రెడ్డి ఏం చేశారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిలు ప్రశ్నించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగుతూ తన స్థాయిని మరింతగా తగ్గించుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే ఆయన అనుచరులు రాచకాలువ డ్రామాను తెరమీదికి తీసుకవచ్చారన్నారు. రాచకాలువ అక్రమ నిర్మాణాలపై గతంలోనే తాను సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని, దమ్ముంటే ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు కూడా వచ్చి అట్టి నిర్మాణాల కూల్చివేతలకు సహకరించాలని అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని క్రిస్టల్ విల్లాస్‌లోని రాచకాలువ, జీ స్క్వేర్ వెంచర్‌లోని 8ఎకరాల 20గుంటల చెరువు ఎక్కడ పోయిందనీ అని ప్రశ్నించారు. తన పార్టీ అధికారంలో ఉన్నని రోజులు కార్పొరేటర్ల హక్కులను కాలరాశాడని కార్పొరేటర్లు వంగా మధుసూధన్ రెడ్డి, కొప్పుల నర్సింహ్మా రెడ్డిలు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అవుతుండడంతోనే డివిజన్‌లలో అభివృద్ధి ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, పలు కాలనీల అధ్యక్షులు శశికాంత్, దామోదర్ రెడ్డి, నందకిషోర్, యాదిరెడ్డి, చిత్రరంజన్, జగన్‌మోహన్ చారి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



వనస్థలిపురం: మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు విజయ్‌నేత, దేవినేని చక్రవర్తి తదితరులు


దిల్‌సుఖ్‌నగర్ : చంద్రబాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారికి తినిపిస్తున్న వెంకట్‌గాంధీ, సురేష్‌నాయుడు

అభిమానం చాటిన చిత్రకారుడు

- పేపరుపై చంద్ర బాబు బొమ్మ

మన్సూరాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలు ఎల్బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ నాగార్జునపు రాము పేపరుపై సీబీఎన్ చిత్రపటాన్ని గీసి రంగులను అద్ది ఆయనపై ఉన్న తన అభిమానాన్ని చాటారు.


పేపరుపై రాము గీసిన చంద్రబాబు చిత్రం

దిల్‌సుఖ్‌నగర్ : తెలుగుదేశం అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీపీ ఎల్‌బీనగర్ అడహక్ కమిటీ సభ్యులు యలమంచిలి వెంకటగాంధీ భవానీ మాత ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహించారు. అనంతరం ఫణిగిరి కాలనీలోని ఆదర్శ ఫౌండేషన్‌లో అనాథలతో కలిసి కేక్ కట్ చేసి, వారికి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ అడహక్ కమిటీ సభ్యులు సురేష్‌నాయుడు, కృష్ణవేణి, రవీందర్, ప్రేమ్, చరణ్, మోహన్‌రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం: టీడీపీ అధినేత చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలు బీఎన్‌రెడ్డినగర్‌లో టీడీపీ మల్కాజ్‌గిరి అడహక్ కమిటీ సభ్యులు గద్దె విజయ్‌నేత ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకులు దేవినేని చక్రవర్తి హాజరై కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణి చేశారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు.


సహపంక్తి భోజనం చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు యశ్పాల్ గౌడ్ తదితరులు

భరత్‌నగర్ -2లో 'గావ్ చలో బస్తీ చలో'

కొత్తపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలలో భాగంగా భరత్‌నగర్ -2 లో బీజేపీ రాష్ట్ర నాయకులు బోల్గం యశ్పాల్ గౌడ్ అధ్వర్యంలో ఆదివారం గావ్ చలో బస్తీ చలో నిర్వహించారు. భరత్‌నగర్ -2 కమ్యూనిటీ హాల్ వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నాయకులు ఓ ఇంట్లో సహపంక్తి భోజనం చేశారు. శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో చీపుర్లు చేతబట్టి నాయకులు వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు స్వామి, యువమోర్చా అధ్యక్షులు ప్రసాదం కిరణ్, బూత్ అధ్యక్షులు జంగయ్య, నాయకులు రా.ందర్, చెన్నయ్య, తరుణ్, వరుణ్, లక్ష్మి, లక్ష్మమ్మ, ప్రేమలత, శ్రీశైలం, నరసమ్మ, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.



- అడుగు వేయండి చూద్దాం..

చంపాపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు నిండి కాలనీలు కంపుకొడుతున్నాయి. రహదారులు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయి. చంపాపేట డివిజన్ రెడ్డికాలనీలోని మారుతీ హాస్పిటల్ లైన్‌లో రోడ్ నం-5లో వర్షాలు కురిసినప్పుడల్లా డ్రైనేజీలు పొంగుతున్నాయి. రహదారులు పూర్తిగా నడవడానికి వీలు లేకుండా బురదమయంగా మారుతున్నాయి.

హస్తినాపురం డివిజన్‌లోనూ..

హస్తినాపురం డివిజన్‌లోని పిండి నారాయణరెడ్డినగర్ కాలనీ ఫేస్-1లోని రోడ్ నెం- 3లో తరచూ డ్రైనేజీలు పొంగుతున్నాయి. రహదారులు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయని కాలనీ అధ్యక్షుడు నీలా మధుసూధన్‌గుప్తా ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



సమస్యలను పరిష్కరిస్తా

- కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో భాగంగా పరిష్కరిస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయిత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సేనావత్ సూర్యనాయక్ ఆధ్వర్యంలో ఆదివారం కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలిసి కాలనీలోని పార్కు, సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కాలనీ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి చైతన్యరెడ్డి, గంగాధర్, బసయ్య, శ్రీకాంత్ నాయక్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.